క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బజార్‌హత్నూర్: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో చౌహన్ రాధ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, గుడిహత్నూర్, నార్నూర్ మండలాలకు చెందిన శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఒర్సి వెంకట రమణ, రాజన్న, ప్రసాద్, జాంసింగ్, విలాస్, దుబ్బుల రమణ, స్వప్న పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జిల్లాలోని జైనథ్, బేల మండలాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్డీవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు. గ్యాస్ కనెక్షన్స్‌కు ఈ–కేవైసీ, ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జైనథ్, బేల మండలాల ప్రజలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తుందన్నారు. ఆయా మండలాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, విపిన్ ఠాక్రే, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్పందించకపోవడం హాస్యాస్పదం

ఎదులాపురం: రిమ్స్ సంఘటనపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పందించకపోవడం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో మెడికోలపై దాడి జరిగి మూడు రోజులు గడుస్తున్నా.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు మెడికోలపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వైద్య విద్యార్థులకు రక్షణ కల్పించాలని, డిమాండ్ చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో ఉన్న మాల కులసంఘానికి చెందిన ప్లాట్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు, కుల సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాలనీలోని కులసంఘ సభ్యులకు తెలియకుండా జంజరుదొడ్డిగా ఉన్న ప్లాట్‌ను అక్రమంగా ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సతీశ్‌రావు, మైలారపు గంగాధర్, పరిమి సురేశ్, జన్నారపు శంకర్, కుంటాల గంగన్న, నేత శ్యాం, రాచమల్ల రాజశేఖర్, ఎర్రన్న, రాజన్న, సతీశ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ధ్యాన శిబిరం వినియోగించుకోవాలి

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతలపేట్ గ్రామంలోని విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రంలో 10 నుంచి 18 ఏళ్లు కల్గిన బాలబాలికలకు ప్రతి నెలా నాలుగో ఆదివారం ఉచిత శిక్షణను అందిస్తామని కేంద్రం నిర్వాహకుడు సాయిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లల్లో భయం, ఆందోళన తగ్గి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు అనపాన ధ్యాన కోర్సులను అందిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 84999 85115నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దుప్పట్లు పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని భిక్షాటన చేసేవారికి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మానవసేవే మాధవ సేవ ఉద్దేశంతో సేవా సమితి ద్వారా యాచకులకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు సమితి సభ్యుడు పాల గంగాధర్ తెలిపారు.

పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు..

- పార్కింగ్ స్థలాలు కరువు
- రోడ్లపైనే వాహనాల నిలుపుదల
- ఇబ్బంది పడుతున్న జనం



శివాజీచౌక్‌లో రోడ్డుపైనే తోపుడు బండ్లు, వాహనాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా మారింది. పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. వాహనాలు రోడ్లపై నిలుపకుండా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు చలాన్ల విధింపుపైనే శ్రద్ధ చూపుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

రోడ్లపైనే తోపుడు బండ్లు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చుట్టూ పక్కల ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు వస్తుంటారు. దీంతో పట్టణంలోని ప్రధాన చౌక్‌లైన అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, శివాజీచౌక్, సినిమా రోడ్‌తో పాటు ఇతర ప్రధాన కూడళ్లన్నీ నిత్యం జనాలతో రద్దీగా కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఎక్కడ పార్కింగ్ జోన్లు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుంటారు. దీనికి తోడు ఆయా చౌక్‌ల్లో చిరు వ్యాపారులు తోపుడు బండ్లను రోడ్ల కిరువైపులా నిలిపి వ్యాపారాలు చేస్తుంటారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మహిళలు, చిన్నారులతో వచ్చిన వారు నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు కాని వాహనాల కోసం పార్కింగ్ స్థలం కేటాయించడం లేదు.



అంబేద్కర్‌చౌక్‌లో..

పట్టించుకోని బల్దియా..

పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్యకు చర్యలు చేపట్టాల్సిన బల్దియా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్రకే పరిమితమవుతుంది. పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసి రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాల్సిన బల్దియా అధికారులు ఆదిశగా దృష్టి సారించడం లేదు. ఇక ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై నిలిపిన వాహనాలకు చలాన్లను వేస్తున్నారు తప్పా.. సమస్య పరిష్కారానికి మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలి



పట్టణంలో పార్కింగ్ జోన్లు లేకపోవడం ఇబ్బందికరంగా మారుతోంది. వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు విధిలేని పరిస్థితుల్లో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. తోపుడు బండ్లను సైతం రోడ్లపైనే నిలుపుతున్నారు. బల్దియా అధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

– స్వామి, అనుకుంట

బానోత్ జాలంసింగ్ సేవలు మరువలేనివి

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



నివాళులర్పిస్తున్న రాథోడ్ జనార్దన్, నాయకులు

నార్నూర్: గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బానోత్ జాలంసింగ్ సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మూడో వర్ధంతి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని బానోత్ జాలంసింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 30 ఏళ్లు సర్పంచ్‌గా నార్నూర్ గ్రామంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అన్నివర్గాల ప్రజల శ్రేయస్సు కోసం పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, రితేష్ రాథోడ్, దేవిదాస్ పవార్, నారాయణ్ నాయక్, షేక్ దాదే అలీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో శనివారం ఏసీఎల్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని సూచించారు. నిరంతరం సాధన చేస్తూ క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. యువత నిత్య జీవితంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. కౌన్సిలర్లు అజయ్, వెంకన్న, అశోక్ స్వామి, మెట్టు ప్రహ్లాద్, రాజు పాల్గొన్నారు.

సమస్యల్లో ‘కస్తూరిబా’ పాఠశాల



నేలపై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థినులు



గాదిగూడలోని కస్తూరిబా గాంధీ పాఠశాల

- కనీస వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో మొత్తం 254 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 54, ద్వితీయ సంవత్సరంలో 42 మంది ఇంటర్ విద్యార్థినులున్నారు. తరగతి గదిలో బ్లాక్‌బోర్డు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు సరఫరా చేయకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న బ్యాగులు, పెట్టెల్లోనే బట్టలు, వస్తువులు దాచుకుంటున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు. ఇంటర్ బోధించే ఉపాధ్యాయులు సర్దుబాటులో భాగంగా రెండు, మూడు రోజులకు ఒకసారి వచ్చి విద్యాబోధన చేస్తున్నారు. దీంతో సిలబస్ పూర్తికాక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రజనీకాంత్ రెడ్డి, షేక్‌అఫ్రోజ్, సంతోష్, ధనుంజయ్ రెడ్డి, భూమన్న, అనీష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శనివారం హైదరాబాద్‌లో అసెంబ్లీ వద్ద నియోజకవర్గంలోని నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంట వెంకట రమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, అంబేకర్ పండరి పాల్గొన్నారు.

‘కార్మికుల ఆకాంక్షలు నెరవేర్చాలి’



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: కార్మికుల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ నాయకత్వంలో కొత్తగా ఏర్పడబోతున్న రాష్ట్ర ప్రభుత్వ హామీలు, కార్మికుల కర్తవ్యాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కడం, అంతులేని అహంకారం, అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలు అనుసరించడం, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అనుసరించడం వల్లే బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు పరాభవం తప్పలేదన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు, గ్రామపంచాయతీ, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాల పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుభాశ్, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి నితిన్, రాజేశ్వర్, వామన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా సేవలు అందించాలి



పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్ మంజుల

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యకర్తలు లబ్ధిదారులకు సేవలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శనివారం మండలంలోని దేవుల్‌తండా, గుత్పాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీస్కూల్, ప్రగతి, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకాల గురించి వివరించాలని సూచించారు. కిశోర బాలికలు, గర్భిణులుకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమయపాలనకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాలన్నారు.

మహాలక్ష్మి పథకం రద్దు చేయాలి



తలమడుగు: ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రైవేట్ ఓనర్స్, డ్రైవర్స్ అసోషియన్ అధ్యక్షుడు పాషా డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. మహిలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలకు గిరాకి లేక తాము ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి వాహనాలను కొనుగోలు చేశామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఈఎంఐలు కట్టాలేని పరిస్థితి నెలకొందన్నారు. రాస్తారోకోలో సంఘం నాయకులు చాహకటి కృష్ణా, రమేశ్, లక్ష్మణ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఆర్థిక సాయం చేయాలి

బోథ్: ఆటో కార్మికులకు ప్రతీ నెల రూ. 15 నుంచి 20 వేల ఆర్థిక సాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆటోల్లో ప్రయాణించడం లేదని, రోజుకు రెండు వందలు కూడా సంపాదించడంలేదని పేర్కొన్నారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సాఫీర్, మండల కార్యదర్శి నౌషాక్, దేవిదాస్, రంజిత్, ప్రభాకర్, జానీ, మజర్, హైమద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు



బోథ్: నినాదాలు చేస్తున్న నాయకులు

ఆటోడ్రైవర్ల రాస్తారోకో

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామ సమీపంలోని అంతరాష్ట్ర రహదారిపై ఆటో డ్రైవర్లు శనివారం ఆందోళన చేపట్టారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం వెంటనే ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జైజవాన్, దీపక్, శ్రీనివాస్, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహణ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన గోడం గణేష్‌ను తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ అగర్వాల్ శనివారం సన్మానించారు. ఆదివాసీల హక్కుల కోసం ని రంతరం ఉద్యమించాలని కోరారు. నాయకులు అనక దేవేందర్, వెట్టి మనోజ్, ఆత్రం భ జంగ్‌రావ్, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ భీమేష్

బోథ్: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ భీమేష్, ఎస్సై రాము అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతీ ఆటోకు ఇన్సూరెన్స్ ఉండాలని, డ్రైవర్లు లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి ఆటోలు నడిపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసీ సంఘం నాయకులు గోవర్ధన్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఈవో భూమారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

నేరడిగొండ: పాఠశాలల్లో ఏ సమస్యలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, విద్యార్థులు ఆందోళన చెందాలి్సన అవసరం లేదని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. ‘ఉపాధ్యాయుడి వెకిలిచేష్టలు.. విద్యార్థుల ఆందోళన’ అనే కథనం ‘సాక్షి’లో ప్రచురితం కావడంతో స్పందించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మను, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చక్కగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లల పోషకులు పాఠశాలకు హాజరు కాగా, వారికి నచ్చజెప్పారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ విజయవంతం చేయండి

ఎదులాపురం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి గౌరవ అధ్యక్షుడు అడెల్లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విమాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణ జరగడం లేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. జిల్లా నుంచి మాదిగ ఉపకులస్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వరూపరాణి

బోథ్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సాంఘిక సంక్షేమ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూప రాణి అన్నారు. శనివారం టీఎస్‌డబ్ల్యూఎస్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.